# ఆమె నవ్వింది

వాసిరెడ్డి సీతాదేవి

ఆమె నవ్వింది!

అతను బిత్తరపోయాడు.

ఆమె మళ్ళీ నవ్వింది. తోడేల్ని చూసి మేకపిల్ల అచ్చం అలాగే నవ్వివుంటుంది. (జంతువులకు నవ్వడం రాదంటారా? వస్తేనే)

అతను వెనక్కు తిరిగి చూశాడు. ఎవరూలేరు. ఆమె తననుచూసి నవ్విందా? నమ్మలేనట్టు చూశాడు ఆమె ముఖంలోకి.

ఆమే ఓరగా చూస్తూ మళ్ళీ అదోలా నవ్వింది.

అతనికి మతిపోయింది.

తను చూస్తుంది కల కాదుకదా! మళ్ళీ ఆమె ముఖంలోకి వెర్రిచూపులు చూశాడు.

అదే నవ్వు! అదే ఓరచూపు!

అతని వళ్ళు ఝల్లుమంది.

అతనూ నవ్వాడు, అచ్చం మేకపిల్లను చూసి తోడేలు నవ్వినట్టే! ఎత్తుగా వుండే ఆ రెండుపళ్ళూ ఆమెను వెక్కిరించాయి.

ముఖంలో మారుతున్న భావాలను బలవంతగా అణచుకుంటూ మళ్ళీ నవ్వింది.

అతని చేతిలోవున్న కాగితాలు సుతారంగా అందుకుంది. అలా అందుకుంటున్నప్పుడు కావాలనే అతని చేతిని తాకింది.

అతని నరాలు జివ్వుమన్నాయి. పెదవులు కదిలాయి. మేకపిల్ల రక్తపు రుచిని తల్చుకుంటూ తోడేలు పెదవులు కదిల్చినట్టు అతను పెదవుల్ని కదిల్చాడు.

ఆమె పేరు విమల కాదు. సుశీల.

అతని పేరు మోహన్ కాదు. రంగనాథం.

ఆమె తెలుగు పాఠకుల్ని ఉర్రూతలూగించే ప్రేమకథల్లోని హీరోయిన్ కాదు. అతను హీరోయిన్ హృదయ వీణను మీటే హీరో కాదు. కానేకాదు.

ఆమె ఆఫీసులో టైపిస్టు. అతను ఆ ఆఫీసు మేనేజర్.

ఆమె నవ్వితే ముత్యాలు రాలలేదు. మల్లెలు విరియలేదు. పన్నీరు చిలకలేదు. అమృతం వర్షించలేదు.

అయినా రంగనాథానికి ఆమె నవ్వులో అవన్నీ కన్పించాయి. పారవశ్యంలో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు.

ఆమె టైపు చెయ్యవలసిన కాగితాలను తీసుకొని బయటికి వెళ్తూ వెళ్తూ వయ్యారంగా వెనక్కు తిరిగి చూసింది. మళ్ళీ నవ్వింది.

ఆమె వెళ్ళిపోయింది.

అతను ఆమె వెళ్ళినవైపే చూస్తూ సంతృప్తిగా నవ్వుకున్నాడు.

* * *

సుశీల చేతిలోని కాగితాల్ని టేబులు మీద పెట్టి, టైప్‌మిషన్ ఎదురుగా కుర్చీలో కూలబడింది. వళ్ళంతా చెమట్లు పడుతుంది. తన కూర్చున్న కుర్చీ, తన పాదాలు తాకుతున్న నేలా, తనను దగా చేస్తున్న ట్టనిపించింది. చుట్టూ విష సర్పాలు బుసలు కొడుతున్నాయి, కాటు వెయ్యడానికి సిద్ధంగా వున్నాయి. ఆమె నిలువెల్లా వణికిపోతోంది.

సుశీల ఇరవయ్యో మైలురాయిని దాటబోతోంది. ఆమె అందగత్తె కాదు. వయసుకు తగ్గ ఆకర్షణతోపాటు ఆమె వ్యక్తిత్వంలో ఏదో ప్రత్యేకత వుంది.

ఆ వయసులో వున్న ఆడపిల్లకు సహజంగా వుండే కోర్కెలు ఆమెకూ వున్నాయి. ఆమె కల్పనాజగత్తులో ఒక చిన్న ఇల్లు నిర్మించుకుంది. ఆ ఇంట్లో తనను అర్థంచేసుకొని గౌరవించి ప్రేమించే భర్తనూ, బోసినవ్వుల్ని విరజిమ్ముతూ, చిలకపలుకులు పలికే ఇద్దరు పిల్లల్నీ ఊహించుకుంటూ వుంటుంది.

కాలేజీలో అందరూ ఆమెను గర్విష్టి అనేవారు. విద్యార్థులకేసి కన్నెత్తికూడా చూడని ఆమె అంటే చాలా మంది మగపిల్లలు పడిచచ్చిపోయేవారు. ఆమెతో మాట్లాడటమే గొప్పగా భావించేవారు. సిగ్గుతో మెలికలు తిరిగిపోకుండా, హుందాగా, నిటారుగా, నిర్లక్ష్యంగా వాళ్ళ మధ్యనుంచి వెళ్ళిపోయే సుశీలను అల్లరి చెయ్యలేకపోయేవాళ్ళు.

ప్రకాశరావు అందగాడు. ధనవంతుడు. ఆ కాలేజీలో ఎక్కువ మంది ఆడపిల్లల కళ్ళలో అతను రాజకుమారుడు. కాని దృష్టిమాత్రం ఎప్పుడూ సుశీలమీదే వుండేది...

"ఏమిటి సుశీలా! వంట్లో బాగా లేదా?" పక్క టైపిస్టు కమల అడిగింది.


సుశీల ఉలిక్కిపడింది. "అబ్బే! ఏం లేదు!" అంటూ సుశీల కర్చీఫుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంది.

టైప్ మిషన్‌లో పేపర్సు ఇన్‌సర్ట్ చేసింది. వ్రేళ్ళు మిషన్‌మీద వేగంగా యాంత్రికంగా కదులుతున్నాయి. చూపులు పక్కనే వున్న ఓ. సి. మీద కదులుతున్నాయి. మనసు గతాన్ని నెమరువేసుకుంటూ వుంది...

ఆ రోజు వర్షంపడటంవల్ల నేలంతా చితచితలాడుతూంది. కాలేజీకి దగ్గరగా వున్న బస్‌స్టాప్ వైపుకు, కుచ్చిళ్ళు పైకి పట్టుకుని నడుస్తూ సుశీలకాలు అరటి తొక్కమీద పడింది. జారిపడుతూ కుడి చేతి ఆధారంతో నిలదొక్కుకున్నది. చేతిలోని పుస్తకాలు దూరంగా పోయి పడ్డాయి.

ఆమె లేచి నిల్చున్నదోలేదో ప్రకాశ రావు పుస్తకాలతో మెరుపులా ఆమె ముందుకొచ్చి నిలబడ్డాడు. ఆమె పుస్తకాలను అందుకుంటూ "థ్యాంక్స్" చెప్పింది. ఆమె కృతజ్ఞతాపూర్వకంగా అతని ముఖంలోకి చూసింది.

ప్రకాశరావు చిరునవ్వు నవ్వాడు. కళ్ళు మిలమిల మెరిసిపోయాయి. కాని ఆమె నవ్వలేదు.



ఆ తర్వాత వరసగా రెండు మూడు రోజులు బస్‌స్టాప్‌లో ప్రకాశం సుశీలకు నవ్వుతూ ఎదురుగా కన్పించాడు. చూసీ చూడనట్టే ఆమె నిల్చుంది. ఆమె పక్కకువెళ్ళి నిలబడి చనువుగా మాట్లాడించడానికి ప్రయత్నించాడు. కాని సుశీల ముఖంచూసి ధైర్యం చెయ్యలేక పోయాడు.

ప్రకాశానికి వళ్లు మండిపోయింది. ఆమె మీద ద్వేషం ఏర్పడింది. ఆమె వింటూ వుండగా, తోటి కుర్రాళ్ళతో ఆమెను గురించి ఏదేదో అనేవాడు. కాని సుశీల వినీవిననట్టే నిర్లక్ష్యంగా వెళ్ళి పోయేది.

కొత్తగా వచ్చిన ఇంగ్లీషు లెక్చెరర్ స్ఫురద్రూపి. చాలా తెలివైనవాడు. బాకులా దూసుకుపోయే వ్యక్తిత్వం కల వాడు. చాలామంది ఆడపిల్లలు పని కల్పించుకొని అతని చుట్టూ చేరేవాళ్ళు. అతని పేరు ప్రసాద్.

ఒకరోజు సుశీల, జానకితో సినిమా నుంచి వస్తూండగా ప్రసాద్ ఎదురైనాడు. ఇద్దర్నీ చిరునవ్వుతో పలకరించాడు. జానకి చిరునవ్వుతో నమస్కరించింది. సుశీలా నమస్కరించింది వినయంగా. కాని నవ్వలేదు. ప్రసాద్ ముఖం చిన్నబుచ్చుకోవడం జానకి గమనించింది. ప్రసాద్ వెళ్ళిపోయాడు.

"మరీ అంత మూతిబిగింపు అందరి ముందూ, అన్నివేళలా బాగుండదు" అంది జానకి.

సుశీల అర్థంకానట్లు చూసింది జానకి ముఖంలోకి.

"ఏం? అర్థంకాలేదా? మన లెక్చెరర్ కదా! కాస్త చిరునవ్వుతో సమాధానం ఇస్తే కొంపలేం మునిగిపోతాయో?"

సుశీల అంటే ప్రసాద్‌కు ఇష్టం అనే విషయం సుశీలకూ, జానకికీ కూడా తెలుసు.

"ఏమో జానకీ! నాకు నవ్వాలని పించదు."

"ఏమిటే నీ చాదస్తం నువ్వూనూ? కాస్త నవ్వినంత మాత్రాన శీలం పోతుందని భయమా?"

"ఛ! అలాంటి పిచ్చి అభిప్రాయాలు నాకు లేవు. ఒకసారి నవ్వుతూ మాట్లాడితే, అది సాకుగా తీసుకొని చనువు పెంచుకోవడానికి చాలామంది ప్రయత్నిస్తారు. చివరకు అది అలుసుగా మారే ప్రమాదం లేకపోలేదు. అందుకే నేను నవ్వను. లేదా నవ్వాలనిపించదు. బహుశా అది నా స్వభావం కావచ్చు!"

"ఏమో తల్లీ! నీ పిచ్చి నా కర్థం కాదు." గుణిసింది జానకి.

"నన్ను అర్థంచేసుకో జానకీ! ఈ ప్రసాద్‌గారి విషయమే తీసుకో. నేనంటే చాలా అభిమానం చూపిస్తాడు. పాఠం చెబుతున్నంతసేపూ కళ్ళు నామీదే వుంటాయి. అటువంటప్పుడు కొంచెం చనువుగా నవ్వాననుకో... ఏమౌతుంది? అనవసరంగా ఏదేదో ఊహించుకుంటూ ..."

"అందువల్ల నష్టం ఏమిటో? ప్రసాద్ కంటే మంచివాడు నీకు దొరుకుతాడా ఏం?" ఆ అవకాశమే తనకు వస్తే ఎంత బాగుండేది? అన్న భావం జానకి కంఠంలో పలికింది.

"నాకు అటువంటి అభిప్రాయం లేనప్పుడు అతని మంచిచెడుల్ని గురించి నేను ఆలోచించను," గంభీరంగా సమాధానం ఇచ్చింది సుశీల.

జానకి సంభాషణ పొడిగించలేదు...

* * *

"సుశీలా! ఏంతవరకయింది?"

సుశీల చివ్వున తలెత్తి చూసింది. టైపుమిషన్ మీద కదులుతున్న ఆమె వేళ్ళు ఆగిపోయాయి. ప్రక్కగా ఆఫీసు మేనేజర్ రంగనాథం.

రంగనాథం సుశీలకు చాలా దగ్గరగా నిల్చుని వున్నాడు.

అతని కంఠం వణికింది. మాటలో చనువు. కళ్ళలో ఏదో భరించలేని భావం ... సుశీల మనస్సంతా చీదర చీదరగా అయిపోయింది. చేతిలో కాగితాలు అతడి ముఖంమీద గిరవాటువేసి ఆఫీసు బయటికి వెళ్ళిపోవాలనిపించింది.

"అయిపోయింది. ఐదు నిముషాల్లో తెస్తాను," సాధ్యమైనంత మామూలుగా సమాధానం ఇచ్చింది సుశీల...

సుశీల చదువు ఇంటర్‌తోనే ముగిసింది. తాసీల్దారుగా పనిచేస్తూ, డిప్యూటీ కలెక్టరుగా ప్రమోట్ కాకుండానే సుశీల తండ్రి గుండెజబ్బుతో అకస్మాత్తుగా చనిపోయాడు. గుర్రప్పందాలు ఆడే అలవాటువున్న అతను, జాక్‌పాట్‌లోని ఐదు నంబర్లూ సరిగ్గా ఎప్పుడూ చెప్పలేకపోయాడు. కాని ఆస్తంతా ఆ ఐదు నంబర్లకే అర్పించినా, భార్యకు మాత్రం ఐదుగురు పిల్లల్ని అప్పగించిపోయాడు. అందర్లో పెద్దది సుశీల. అందరూ హైస్కూలూ, ప్రైమరీ స్కూల్లో చదివేవాళ్ళే. తల్లి రోగిష్టిది. ఎప్పుడూ ఆయాసం-రక్తపుపోటు; ఏమున్నా లేకపోయినా ఆమెకు మందులు మాత్రం వుండాలి. ఆ జబ్బు అలాంటిది. గవర్నమెంటు నుంచి లభించే ఫామిలీ పెన్షన్‌తో నెలలో సగంరోజులు గడవడమే అంతంతమాత్రంగా వుండేది.

సుశీల టైపు నేర్చుకుంది. అతికష్టం మీద టైపిస్టు ఉద్యోగం దొరికింది.

ఉద్యోగంలో చేరినరోజు ఆఫీసు మేనేజర్ దగ్గిరకెళ్ళి జాయినింగ్ రిపోర్టు ఇచ్చింది. రిపోర్టు అందుకుంటున్న అతని చెయ్యి సుశీల చేతికి తగిలింది. కాదు-కావాలనే అలా చేశాడు. సుశీల అతని ముఖంలోకి చూసింది. అదోలా చూస్తూ నవ్వాడు. సుశీల నవ్వలేదు. నొసలు ముడిచింది. రంగనాథం ముఖం ముటముటలాడిపోయింది.

సెక్షన్‌లోవున్న గుమస్తాలు ఒకరి ముఖంలోకి ఒకరు చూస్తూ సన్నగా నవ్వుకోవడం సుశీలకు కన్పించింది.

అదే సమయంలో విమల టైపుచేసిన కాగితాలు రంగనాథానికి అందించింది, ముసిముసిగా నవ్వుకుంటూ. రంగనాథం దాదాపు ఆమె చెయ్యి పట్టుకున్నట్టే తాకుతూ కాగితాలు అందుకున్నాడు. ఆ అమ్మాయి బల్లమీద దాదాపు పడుకున్నట్టే వాలి నిల్చుంది. ఆమె పైట తొలగింది. రంగనాథం చూపులు ... ఆమె సిగ్గుపడుతూ పైట సర్దుకోవడం... చూస్తుంటే ఆ అమ్మాయి అలా కావాలనే చేసినట్టు సుశీలకు అర్థం అయింది. సుశీలకు ఆ అమ్మాయి మీద ఎక్కడలేని కోపం వచ్చింది.

"నువ్వెళ్ళు. అదిగో ఆ ఎదురుగా వున్న మిషన్ నీదే! ఈ కాగితాలు టైపు చెయ్యి." విసురుగా రంగనాథం సుశీలకు కాగితాలు అందించాడు.

సుశీలకు వెనకనుంచి రంగనాథమూ, ఆ అమ్మాయీ నవ్వుకోవడం వినిపించింది. రంగనాథం ఏదో జోక్ వేశాడు. విమల పకపక నవ్వింది. ఆ జోక్ తన మీదే అయివుంటుందని అనుకుంది సుశీల

ఉద్యోగంలో చేరి మూడు నెలలు గడిచినా సుశీల ఆ వాతావరణంలో ఇమిడిపోలేకపోయింది. తన తోటి ఇద్దరు లేడీ టైపిస్టులు-విమలా కమలా రంగనాథంతోనూ, గుమస్తాలతోనూ వెకిలిగా మాట్లాడటం, వాళ్ళు పిచ్చిగా నవ్వడం ...అసహ్యంగా కులకడం చూస్తూనే వుంది. వాళ్ళు రంగనాథంతో ఒకటి రెండు సార్లు బస్‌స్టాపులో వున్న హోటల్‌కు వెళ్ళడం కూడా చూసింది సుశీల.

ఒకరోజు ఆలస్యంగా ఆఫీసునుంచి బయలుదేరిన సుశీల, తన వెనకే రంగనాథం రావడాన్ని గమనించింది. గబగబా నడవసాగింది.

"సుశీలా! కాఫీ తాగుదాం వస్తావా?" బస్‌స్టాపు చేరగానే పక్కగావచ్చి నిలబడి రంగనాథం అడిగాడు.

''సారీ! నేను రాను!" అన్నది సుశీల.

"ఏం? కాఫీ తాగితే తప్పా? మీరంతా ఉద్యోగాలు చేస్తారు. పెద్ద చదువులు చదివారు. భావాలు మాత్రం బూజుపట్టినవే. హోటల్‌కు వచ్చినంత మాత్రాన ఏమౌతుంది?" రెట్టించాడు, రంగనాథం

"నా కిష్టంలేదు. ఇష్టంలేని పని నేను చెయ్యను." ఖచ్చితంగా సమాధానం చెప్పి ముఖం తిప్పుకొని నిల్చుంది సుశీల...

ఆరోజునుంచి సుశీలకు ఆ ఆఫీసులో నరకానికి తెరలు లేచాయి. ప్రతి చిన్నదానికి రంగనాథం తప్పులు పట్టడం, పై ఆఫీసరుకు కంప్లెయింటు చెయ్యడం ప్రారంభించాడు. విమలా, కమలా, సుశీలను రంగనాథం సాధిస్తుంటే ముసిముసిగా నవ్వుకొనేవారు.

"నీలో ఉద్యోగంచేసే లక్షణాలు లేవు."

"ఇట్లా అయితే ఈ ఉద్యోగం ఎంతో కాలం నిలవదు.''

''ఆఫీసరుగారికి నువ్వు పనిచెయ్యడం లేదనే ఇంప్రెషన్ వచ్చేసింది."

రంగనాథం బెదిరిస్తూ వుండేవాడు.

తల్లికి జబ్బుచెయ్యడంవల్ల సుశీల వారం రోజులు లీవ్ పెట్టింది.

ఆ రోజు ఆఫీసుకు రాగానే మేనేజర్ పిలిపించాడు. భయపడుతూనే సుశీల మేనేజర్ బల్లదగ్గిరకెళ్ళి నిలబడింది.

''ఇదిగో, ఇక్కడ సంతకంపెట్టి ఇది తీసుకో!'' అన్నాడు రంగనాథం.

సుశీల వణుకుతున్న చేతితో సంతకం పెట్టి 'మెమో' అందుకొని చదువుకుంది. విమలకు చెమట్లు పట్టాయి. "ఆమె పని సరిగాలేదనీ, ఇష్టమొచ్చినట్టు శెలవులు పెడుతుందనీ ... కనుక ఆమెను ఉద్యోగంనుంచి ఎందుకు తొలిగించకూడదో సంజాయిషీ ఇవ్వమనీ... రాసివున్నది.

ఆమెను సానుభూతితో అర్థంచేసుకున్న రామరావు జాలిగా చూశాడు.

విమలా, కమలా ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుంటూ నవ్వుకున్నారు.

సుశీల కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

తను సరిగా పనిచెయ్యడంలేదా! ఇష్టమొచ్చినట్టు లీవ్ పెడుతుందా? తన పనికాకుండా, ఆ ఇద్దరు టైపిస్టులు చెయ్యాల్సిన పనికూడా తనకే అప్పజెపుతూవుంటాడు రంగనాథం. అయినా తను కిక్కురుమనకుండా చేస్తూనే వుందిగా!

సుశీల మనసు మనసులో లేదు. పని చేస్తూనేవుంది. అయినా అర్జెంటు పేపర్లు ఇంకా వున్నాయి. ప్యూన్‌వచ్చి లైట్ వేస్తే ఉలిక్కిపడి టైం చూసుకుంది. ఆరుంబావు అయింది. తలెత్తి చూసింది. ఆఫీసులో రంగనాథం తప్పించి మరెవరూ లేరు.

సుశీల టైపుచేసి పేపర్లు తీసుకెళ్ళి రంగనాథం బల్లమీద పెట్టింది.

"అన్నీ చేశావా?"

"ఇంకా వున్నాయి. రేపు చేస్తాను," అంటూ వెనక్కి తిరిగింది.

"సుశీలా?"

సుశీల ఆగి, తిరిగి రంగనాథవైపు చూసింది.

"మరీ అంత టెక్కు పనికిరాదు. నా మాట విను. ఆ విమల్నీ, కమల్నీ చూసైనా ఆఫీసులో ఎలా ప్రవర్తించాలో నేర్చుకో!" అన్నాడు రంగనాథం.

సుశీల మాట్లాడలేదు.

"మూడురోజులు టైం వుంది. బాగా ఆలోచించుకో!"

"మూడురోజులు అక్కర్లేదు, రేపే నేనే రిజిగ్నేషన్ ఇస్తాను," అంటూ విసురుగా బయటికి వెళ్ళిపోయింది సుశీల.

బస్ అంది ఇంటికి చేరేప్పటికి రాత్రి ఎనిమిదిన్నర అయింది.

తల్లి ఆయాసంలో ఉక్కిరి బిక్కిరి అయిపోతూంది.

''ఏమ్మా మందు తెచ్చావా?" తల్లి అతి కష్టంమీద ఆయాసపడుతూ అడిగింది.

"లేదమ్మా!" బాధగా జవాబిచ్చింది సుశీల.

తల్లి ఓ క్షణం కూతురి ముఖంలోకి చూసి "పోనియ్‌లే తల్లీ! ఈ రాత్రికి ఎలాగో అవస్థపడతాను. చిన్నపిల్లలు నిద్రకు పడుతున్నారు. త్వరగా అన్నం వండు'' అన్నది తల్లి దగ్గుతెరలమధ్య.

సుశీల వంటింట్లోకెళ్ళి బియ్యం చూసింది. నాలుగు పావులు మాత్రం వున్నాయి. రెండు పావులు వండి పిల్లలకు సర్దిపెట్టింది. చిన్నవాడు అనం చాలలేదని అల్లరిచేశాడు.

సుశీల అన్నం తినలేదు. రాత్రంతా తల్లికి సేవలుచేస్తూ కూర్చుంది. ఆమె దగ్గుతూవుంటే సుశీలకు గుండెలు కదిలిపోతున్నాయి.

సుశీల మనసు మనసులోలేదు. తనకు ఉద్యోగంపోతే? తల్లి జబ్బు...తమ్ముళ్ళనూ చెల్లెళ్ళనూ పోషించడం...ఎలా? ఎలా?

తను ఏం చెయ్యాలి? తప్పదా? తనూ విమలా, కమలకు మల్లే...లేదు...లేదు ...తను అలా చెయ్యలేదు. అలా బ్రతకలేదు...

ఉద్యోగం పోతుంది. అమ్మ మందు లేక చచ్చిపోతుంది. తమ్ముళ్ళు ఆకలి భరించలేక దొంగతనాలు చేస్తారు. చెల్లెళ్ళు...

ముందుకు ఆలోచించలేకపోయింది. చివరకు సుశీల ఒక నిర్ణయానికి వచ్చింది.

తెల్లవారి ఆఫీసుకు వచ్చింది.

వస్తూనే రంగనాథం గదిలోకి వెళ్ళింది. అతన్ని చూసి నవ్వింది. అతను తెల్లబోయాడు. మళ్ళీ నవ్వింది. అతని వళ్లు ఝల్లుమంది.

టైపుచేసిన కాగితాలు అందిస్తూ మళ్ళీ నవ్వింది. పక్కనేవున్న రామారావుకేసి చూసింది. రామారావు విషాదంగా నవ్వాడు.

ఐశ్వర్యవంతుడూ, అందగాడూ అయిన ప్రకాశరావు ఆమెను నవ్వించలేకపోయాడు. విద్యావంతుడూ సంస్కారి అయిన ప్రసాదరావూ ఆమెను నవ్వించలేకపోయాడు.

తోడేలుముఖం ఆఫీసు మేనేజర్ రంగనాథం ఆమెను నవ్వించగలిగాడు.

చివరకు ఆమె నవ్వింది.

సుశీల నవ్వింది. సుశీలేకాదు, సుశీలలా ఉద్యోగాలు చేస్తున్న యువతులు చాలా మంది రోజూ నవ్వుతూనే వున్నారు.

ఇది సుశీలకథే కాదు. ఇదే విమలా, కమలల కథ కూడా.

సుశీలలూ, కమలలూ, విమలలూ రోజూ నవ్వుతూనే వున్నారు.

ఎందుకంటారా?

అది మీకూ తెలుసు?

తర్వాత కథ అంటారా?

అదీ మీకు తెలిసిందే?

అయినా మీరంటారు "వెధవ ఉద్యోగంకోసం శీలంపోగొట్టుకోవాలా?" అని.